

పార్లమెంటు ఎన్నికల్లో సిపిఐ మద్దతు కోరేందుకు హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్ భవన్‌కు వచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు స్వాగతం పలుకుతున్న సిపిఐ నాయకులు


ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 21 | ఏప్రిల్ | 2024
పేజీలు 8


# తగ్గేదెవరు..ఇచ్చేదెవరికి..!

## కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ

- క్యాడర్‌లో నైరాశ్యం
- తేలిన కరీంనగర్.. మిగిలింది ఖమ్మం, హైదరాబాదే..

2లో

**ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థికి సంబంధించి** పట్టుబడుతున్న వారిలో తగ్గేదెవరు, అధిష్టానం సీటు ఇచ్చేది ఎవరికి అన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై మూడు రోజులు గడిచినా అభ్యర్థి ఎంపిక జరగలేదు. మరో రెండు రోజుల వరకు తేలే అవకాశం లేదని సమాచారం. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం తమ అనుచరులు లేదా బంధుగణానికి ఇప్పించుకునేందుకు పోటీ పడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ పోటీ పై కాస్త పట్టు సడలించినప్పటికీ మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కుటుంబ సభ్యుల కోసం గట్టి పట్టుబడుతున్నారు. ఓ దశలో మంత్రుల కుటుంబ సభ్యులు కాకుండా అభ్యర్థిని ఎంపిక చేయాలని అధి నాయకత్వం నిర్ణయించినా ఆ నిర్ణయాన్ని కూడా అమలు చేయలేని పరిస్థితి. ఇప్పుడు స్థానికత, సామాజిక వర్గం రెండు అంశాలు అభ్యర్థి ఎంపిక చుట్టూ తిరుగుతున్నాయని సమాచారం.

-ప్రజాపక్షం/ఖమ్మం



## వ్యయ ఖర్చుల లెక్కలు
# పకడ్బందీగా చేపట్టాలి

### వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్, శంకర నంద్




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్: వ్యయ ఖర్చుల లెక్కలు పకడ్బందీగా చేపట్టాలని ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రాలు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వ్యయ పరిశీలకులు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ధన, మద్యం ప్రలోభాల నియంత్రణ కు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి రూ. 95 లక్షల ఖర్చు పరిమితి ఉందన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసినప్పటి నుండి ఖర్చు అభ్యర్థి ఖాతాలో చూపాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, రేడియో, సోషల్ మీడియా తదితర మాధ్యమాల్లో ప్రచార ఖర్చంతా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ర్యాలీలు, సభలు, వాహనాల ద్వారా ప్రచారంపై నిఘా పెట్టాలన్నారు. ప్రచారానికి వివిధ అనుమతులకు అయిన ఖర్చు అభ్యర్థికి తెలియజేయాలని, ఖర్చు రిజిస్టర్లు అభ్యర్థులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, అభ్యర్థుల ఖర్చుకు సంబంధించి షాడో రిజిస్టర్లు నిర్వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లెక్క పత్రం లేని
# ఇసుక తరలింపు



- అధికారులకు కాసులు కురిపిస్తున్న ఇసుక ర్యాంపులు
- బినామీ కాంట్రాక్టర్లతో చేతులు కలుపుతున్న సిబ్బంది
- కొందరి పరమవుతున్న ప్రకృతి సంపద

ప్రజాపక్షం/ ఖమ్మం / చర్ల : గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక తరలింపుకు సంబంధించి లెక్క పత్రం లేకుండాపోయింది. నది గర్భం నుంచి ఎంత ఇసుకను డంప్ యార్డుకు చేరుస్తున్నారు, అక్కడి నుంచి ఏ మేరకు ఇసుకను తరలిస్తున్నారనే దానిపై అధికార యంత్రాంగం వద్ద లెక్క లేదు. కాంట్రాక్టర్లతో చేతులు కలిపి ఇష్టానుసారంగా గోదావరి నదిని తోడేస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్ల కోసం అధికారులు పని చేస్తున్నారు తప్ప ప్రకృతి సంపదను కాపాడడం కానీ, నిబంధనలను పాటింపజేయడం కానీ వారికి పట్టినట్లు లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినా, ఏదైనా మీడియాలో

మిగతా 2లో..

# తగ్గేదెవరు..ఇచ్చేదెవరికి..!






ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థికి సంబంధించి పట్టుబడుతున్న వారిలో తగ్గేదెవరు, అధిష్ఠానం సీటు ఇచ్చేది ఎవరికి అన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై మూడు రోజులు గడిచినా అభ్యర్థి ఎంపిక జరగలేదు. మరో రెండు రోజుల వరకు తేలే అవకాశం లేదని సమాచారం. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం తమ అనుచరులు లేదా బంధుగణానికి ఇప్పించుకునేందుకు పోటీ పడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ పోటీ పై కాస్త పట్టు సడలించినప్పటికీ మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కుటుంబ సభ్యుల కోసం గట్టి పట్టు బడుతున్నారు. ఓ దశలో మంత్రుల కుటుంబ సభ్యులు కాకుండా అభ్యర్థిని ఎంపిక చేయాలని అధి నాయకత్వం నిర్ణయించినా ఆ నిర్ణయాన్ని కూడా అమలు చేయలేని పరిస్థితి. ఇప్పుడు స్థానికత, సామాజిక వర్గం రెండు అంశాలు అభ్యర్థి ఎంపిక చుట్టూ తిరుగుతున్నాయని సమాచారం. సామాజిక మాధ్యమాలలో మాత్రం అభ్యర్థి ఎంపిక పూర్తయింది అంటూ ఆయా నాయకుల అనుకూల వర్గాలు ప్రచారం చేస్తుండడంతో గందర గోళం నెలకొంది. ప్రస్తుతం ఐదు పేర్లు మాత్రం అధిష్ఠాన వర్గం పరిశీలనలో ఉన్నాయని ఆ ఐదుగురి నుంచి ఒకరు ఎంపిక కావచ్చునని భావిస్తున్నారు. ఏ కాంగ్రెస్ నేతను అభ్యర్థి ఎంపిక విషయమై కదిపినా అధిష్ఠాన నిర్ణయం మా చేతిలో ఏమి లేదంటూ సమాధానమిస్తున్నారు.

మంత్రులు పట్టువిడుపులపై ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ఉంటుందనేది వాస్తవం. రాష్ట్రంలోని 17 నియోజక వర్గాలలో ప్రధానమైన ఓ సామాజిక వర్గానికి ఒక్క స్థానం కూడా కేటాయించనందున ఆ సామాజిక వర్గానికే ఖమ్మం సీటు కేటాయిస్తారని కొందరు లేదు గతంలో ఇచ్చిన హామీ మేరకు అధిష్ఠానం అభ్యర్థిని ఎంపిక చేస్తుందని మరి కొందరు ప్రచారం చేస్తున్నారు. మధ్యే మార్గంగా వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి వియ్యంకుడు రామసహాయం రఘురామిరెడ్డి పేరు కూడా వినిపిస్తున్నది. నిజామాబాద్ జిల్లాకు చెందిన మండవ వెంకటేశ్వరరావు, ఖమ్మంజిల్లాకు చెందిన రాయల నాగేశ్వరరావు, పొట్ల నాగేశ్వరరావు లతో పాటు మంత్రుల కుటుంబ సభ్యులు మల్లు నందిని, పొంగులేటి ప్రసాదరెడ్డి, పారిశ్రామిక వేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ చివరి జాబితాలో ఉన్నట్లు చెబుతున్నారు. కరీంనగర్ స్థానం నుంచి ప్రవీణ్ రెడ్డిని ఎంపిక చేయడంతో ఖమ్మం సామాజిక వర్గాల సమీకరణలో కాస్త స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది.మంత్రుల కుటుంబ సభ్యులలో ఎవరికి ఇచ్చినా పార్టీలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయన్న వాదనను అధిష్ఠానం ముందు కాంగ్రెస్ నేతలు ఉంచారు. తెర ముందు, తెర వెనక పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక వాయిదా పడుతూ వస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో ఆలస్యం ఆ పార్టీకి ఎంతో కొంత నష్టం చేస్తుందన్నది వాస్తవం. ఇదే సమయంలో కాంగ్రెస్ క్యాడర్‌లోనే భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. లోకల్ అభ్యర్థి అయితే ఒక వేళ కాక పోతే అనే వాదనల మధ్య కాంగ్రెస్ ఓటు చెదిరిపోతుందన్న ప్రచారం జరుగుతుంది. దీనికి తోడు ఇప్పుడిప్పుడే వర్గ భావన క్యాడర్‌లోకి వెళ్తుంది. ఇది కూడా ఇబ్బందికర పరిస్థితికి దారి తీయవచ్చు. వీటికి తోడు రుణమాఫీ తదితర అంశాలను రాజకీయ అంశాలుగా విపక్షాలు మారుస్తున్న వేళ కాంగ్రెస్‌కు గత ఊపు ఇప్పుడు కనిపించడం లేదు. అభ్యర్థి ఎంపిక, ప్రచారం తదనంతర ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూద్దాం.

# లెక్క పత్రం లేని ఇసుక తరలింపు

(మొదటిపేజీ తరువాయి)

ఇసుక తరలింపుకు సంబంధించి వార్త వచ్చినా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని ఇసుక ర్యాంపులను పర్యవేక్షిస్తున్న మైనింగ్, రెవెన్యూ సహా ఇతర అధికారుల పంట పండినట్లే. ఆ ఫిర్యాదును పట్టుకుని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం బేరాలు మాట్లాడుకుని ఎంచక్కా డబ్బులు పొగేసుకుంటున్నారు. అధికారుల తోడ్పాటుతో బినామీ కాంట్రాక్టర్లు రెచ్చిపోతున్నారు. నది గర్భం నుంచి ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించారు అని మైనింగ్ అధికారులను అడిగితే సమాధానం చెప్పలేని స్థితిలో అధికారులు ఉన్నారంటే ఇక ప్రభుత్వ నిబంధనలను ఏ మేరకు పాటిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. లక్షల రూపాయలు ఎరగా వేసి బినామీ కాంట్రాక్టర్లు సొసైటీలకు డబ్బు లు ఎరచూపి ఇసుక తరలింపుకు అనుమతులు తెచ్చుకుంటున్నారు. ఇసుక ర్యాంపుకు సంబంధించి ఫైల్ క్లియర్ కాగానే ఇక బేరాలు మొదలవుతాయి. రూ. 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఇసుక తరలింపు ప్రక్రియకు సంబంధించిన అనుమతులను అమ్ముకుంటున్నారు. కొంద రైతే ఒకే అనుమతిని ఇద్దరు ముగ్గురు కాంట్రాక్టర్లకు అమ్ముకోవడం గమనార్హం. చర్ల మండల పరిధిలోని పెద్దిపల్లి ఇసుక క్వారీ విషయంలో అయితే ఇక్కడి బినామీ కాంట్రాక్టర్ పలువురిని రంగంలోకి దిం పాడు. హైదరాబాద్‌కు చెందిన బడా కాంట్రాక్టర్లతో పాటు ఖమ్మంకు చెందిన ఓ లారీ యజమానిని సైతం ఇక్కడకు తెచ్చి ఒక రకంగా ఫ్యాక్షన్ తరహాలో ఇసుకను తరలిస్తున్నాడు. పెద్దిపల్లి ర్యాంపులో ఇసుక తరలింపు వ్యవహారం అతి పెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం ఇక్కడి కాంట్రాక్టర్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఇక టిఎస్ఎండిసి స్థానిక రెవెన్యూ అధికారులు బినామీ కాంట్రాక్టర్ చెప్పినట్లు చేస్తున్నారు తప్ప ప్రభుత్వ అధికారులుగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా పెద్దిపల్లి వైపు కన్నెత్తి చూడడం లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనింగ్ అధికారులకు గోదావరి ఒక వరంలా మారింది. ఇక్కడి ఇసుక ర్యాంపులు కాసులు కురిపిస్తున్నాయి. ఆ మామూళ్ల మత్తులో నిబంధనలు గాలికి పోయి ఫిర్యాదులు చెత్తబుట్టలోకి చేరుతున్నాయి. గతంలో ఓ ప్రజాప్రతినిధి ఈ ఇసుక ర్యాంపులకు సంబంధించి పెత్తనం చేసి కోట్లు కూడగట్టుకున్నాడన్న ప్రచారం మరువక ముందే ఇప్పుడు అధికారులు అదే రకం విమర్శలను ఎదుర్కొంటున్నారు. జిల్లాకు సంబంధించిన రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముందుగా కాంట్రాక్టర్ల కంటే వాళ్లకు సహకరిస్తున్న అధికారుల పై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ప్రజల నుంచి వినవస్తున్నది. మరి అధికారులు, ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో వేచి చూద్దాం.

# జిల్లా అభివృద్ధికి కృషి చేశా..

**-మరోమారు ఓటు వేసి గెలిపించండి**
**-పటేల్ స్టేడియంలో నామ ప్రచారం**

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మంజిల్లా అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తెలిపారు. మరోమారు తనకు ఓటేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం స్థానిక సర్దార్ పటేల్ మైదానంలో, కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నమ్మితే మోసం చేసిందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారని మరోమారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే ప్రసక్తే లేదని ప్రజలు స్పష్టం చేస్తున్నారని నామ తెలిపారు. ప్రజలు గెలిపిస్తే జిల్లా అభివృద్ధికి మరోసారి కృషి చేస్తానని, తెలంగాణ ప్రజల గొంతుకగా పార్లమెంటులో వినిపిస్తానన్నారు.



# ఎన్నికల హామీలను అమలు చేయండి

**-బిఆర్ఎస్ పోస్టు కార్డు ఉద్యమం**
**-పాల్గొన్న వద్దిరాజు, పువ్వాడ, నామ తదితరులు**




ప్రజాపక్షం/ ఖమ్మం : ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పిలుపు మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. రెండు లక్షల రుణమాఫీ, రైతు బంధు రూ. 15వేలకు పెంపు, పింఛన్ నాలుగు వేలకు పెంపు, ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి తాతా మధు తదితరులు పాల్గొన్నారు.

# రాయల నర్సింహారావును కలిసిన దొండపాటి

ప్రజాపక్షం/ తల్లాడ : డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు శనివారం తల్లాడలోని రాయల నర్సింహారావు నివాసంలో జరిగిన తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొండపాటికి కాంగ్రెస్ యువ నాయకుడు రాయల రాము మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. ముందుగా తల్లాడ వచ్చిన సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు డిసిసిబి బ్యాంక్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా రానున్న రోజుల్లో ఖమ్మం కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు మనందరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలోఅయినాల నర్సింహారావు, ధూపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి తుమ్మలపై దాడికి కుట్ర పన్నడం హేయమైన చర్య

ప్రజాపక్షం/ తల్లాడ : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, అభివృద్ధి ప్రదాత తుమ్మల నాగేశ్వరరావుపై కొందరు దుండగులు దాడికి కుట్ర పన్నడం హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారెళ్ళ లక్ష్మణరావు అన్నారు. శనివారం తల్లాడ మండలం అన్నారుగూడెంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిపై ఇలాంటి దాడికి కుట్ర పన్నడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇటువంటి కుట్రలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# తాజా మాజీ సర్పంచ్ పుల్లయ్య ఔదార్యం..!



ప్రజాపక్షం/ నేలకొండపల్లి : మండలంలోని రాజేశ్వరపురం గ్రామపంచాయతీలో ప్రజల తాగునీటి ఎద్దడిని నివారించేందుకు తాజా మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య ముందుకు వచ్చారు. గ్రామస్తులు తాగునీటి సమస్యను గుర్తించిన సర్పంచ్ పుల్లయ్య తన తల్లిదండ్రులు దండా సీతమ్మగోపయ్య మెమోరియల్ ద్వారా మంచినీటి సరఫరాను శనివారం ప్రారంభించారు. వేసవి కాలం వరకు రెండు నెలలు పాటు గ్రామంలో ని ప్రజలకు దాహార్తి ని తీర్చేందుకు మంచినీటిని సరఫరా చేసేందుకు కార్యాచరణ ను రూపొందించారు. రోజుకు 6 నుంచి 7 ట్యాంకర్ల వరకు గ్రామస్తులకు అందించనున్నారు. మంచినీటి ట్యాంకర్ల ద్వారా గ్రామంలోని అన్ని వార్డుల ప్రజలకు తాగునీటి ని అందించే కార్యక్రమం ను నిర్వహించనున్నారు. తాజా మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య ఔదార్యం ను గ్రామస్తులు రాజకీయాలకు అతీతంగా అభినందనలు తెలిపారు.

# మాజీ మంత్రి పువ్వాడపై ఆరోపణలు నిరాధారం

## -ఆధారాలు ఉంటే బయటపెట్టండి
## -మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై ఎన్నికల సమయంలో దాడి చేయడానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కుట్ర పన్నారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని దీనిని బిఆర్ఎస్ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ నేతలు తెలిపారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ లు మాట్లాడుతూ పత్రికలో వచ్చిన నిరాధారమైన వార్తను చూపిస్తూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పై ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. తుమ్మల పై దాడి చేయాల్సిన అవసరం మాకు లేదన్నారు. గత ఎన్నికల్లో ఇష్టానుసారంగా హామీలు ఇచ్చారని అవి నెరవేర్చలేక ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలో తెలియక ఆ అంశాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగానే కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. పువ్వాడ కుటుంబం ఐదు దశాబ్దాలుగా ప్రజల మన్ననలు పొందుతుందని వారి చరిత్ర తెరిచిన పుస్తకమన్నారు. రాజు మెప్పు పొందెందుకు వెనక ఉండే సామంతుల్లా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. ఆరోపణలపై కాంగ్రెస్ నాయకుల వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మగ్బూల్, దండా జ్యోతిరెడ్డి, మైనార్టీ అధ్యక్షులు తాజుద్దీన్, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, నరేంద్ర, లీగల్ సెల్ సెనాయకులు మేకల సుగుణారావు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ వినతి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పెద్ద తండా పంచాయతీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఎంపిడీఓ, స్పెషల్ ఆఫీసర్ కుమార్‌కు జలగంనగర్ లోని కార్యాలయంలో వినతి ప్రతాన్ని శనివారం అందజేశారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచి తాగునీటి ఎద్దడిని అరికట్టడంతో పాటు మెయిన్ రోడ్ నుండి ప్రియదర్శిని కాలేజీ వరకు వాహనాల రాకపోకలతో దుమ్ము,దూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వినతిలో పేర్కొన్నారు. ఈ రోడ్డుని సిసిరోడ్డుగా మార్చాలని, పెద్దతండా గ్రామవాసులు ఎదుర్కొంటున్న స్మశానవాటికను త్వరలో నిర్మించాలని కోరారు. తండాల్లో ఆగిపోయిన సిసిరోడ్లను వెంటనే మొదలుపెట్టి తాగునీటికి ప్రాముఖ్యత ఇవ్వాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బానోత్ గడ్డనాయక్, దేవా నాయక్, బోడ బాలాజీ,



మాలోతు సంధ్యానాయక్, పాల్తీ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్ స్టేషన్ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/ మధిర :** ప్రస్తుత వేసవికాలంలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ స్టేషన్ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బండారు రాంబాబు పేర్కొన్నారు. మధిర మున్సిపాల్టీ పరిధి ఎంప్లాయీస్ కాలనీలోని ఫైర్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక నివారణ వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల సమయంలోనే కాకుండా ప్రకృతి విపత్తుల సమయంలో, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, జల ప్రమాదాలు సమయంలో కూడా సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఫైర్ వారోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందచేశారు. ఈకార్యక్రమంలో ఫైర్ సిబ్బంది బి.నాగేశ్వరరావు, బి.అనంతరామిరెడ్డి, భాస్కర్, ఎం.సతీష్, టి.మోహన్, కె.చెన్నారావు, శ్రీను, కృష్ణప్రసాద్, రాంప్రసాద్, సర్వేశ్వరరావు, ఎంప్లాయీస్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ మధిర :** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను మధిర పట్టణంలో స్థానిక టిడిపి పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం జన్మదిన కేక్ కట్ చేసి స్విట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఎన్నికల్లో ఆంధ్రాలో టిడిపి కూటమి అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లాది హన్మంతరావు, రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్‌బాబు, నాయకులు వంగాల రామకోటేశ్వరరావు, మార్నిడి పుల్లారావు, మేడేపల్లి



రాణి, కౌన్సిలర్లు వంకాయలపాటి నాగేశ్వరరావు, వీరమాచినేని నాగసులోచన, చెరుకూరి కృష్ణారావు, అనుమోలు సతీష్ పాల్గొన్నారు.

# మడుపల్లి బస్తీ దవఖానాకు వైద్యున్ని నియమించాలి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి బస్తీదవఖానాకు వైద్యున్ని నియమించాలని సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మడుపల్లి బస్తీదవఖానాలో వైద్యుడు లేకపోవడంతో దవఖానాకు వచ్చే రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులకు, డిఎంఅండ్‌హెచ్ఓకు విన్నవించినా పట్టించుకోవటం లేదన్నారు. ప్రతిరోజు సుమారు 30మంది ఓపి పేషంట్లు వస్తుంటారని, కాని వైద్యుడు లేకపోవడంతో సరైన వైద్యం అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే మడుపల్లి బస్తీ దవఖానాకు వైద్యున్ని నియమించాలని కోరారు.

# దాడికి కుట్ర చేయడం హేయమైన చర్య



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాడికి కుట్ర చేయడం హేయమైన చర్య అని దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఐదవ డివిజన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏలూరి శ్రీనివాసరావు, పల్లెబోయిన చంద్రం, కార్పొరేటర్ లకావత్ సైదులు, యల్లంపల్లి హన్మంతరావు తదితరులు మాట్లాడుతూ చైతన్యవంతమైన ఖమ్మంజిల్లాలో ఇటువంటి దాడులకు, హత్యా రాజకీయాలకు తావులేదన్నారు. 40 ఏళ్ల పాటు నీతికి, నిజాయితీకి మారుపేరుగా ఆదర్శవంతమైన రాజకీయ నాయకునిగా ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై ఇటువంటి దాడి, హత్యాప్రయత్నాలకు కుట్ర పన్నడం సిగ్గు చేటన్నారు. ఓ పోలీస్ అధికారితో పాటు దీంట్లో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం ప్రజలు ప్రశాంత వాతావరణం కోరుకుని కాంగ్రెస్‌ను గెలిపించారని వారు తెలిపారు. మంత్రి తుమ్మల పై దాడికి కుట్ర పన్నిన ఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బొందిలి నాగేంద్ర సింగ్, తమ్మినేని వెంకటేశ్వరరావు, చల్లా రామకృష్ణ, ఆకారపు కృష్ణవేణి, బందు వెంకటేశ్వర్లు, తోట సైదులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన 16వ డివిజన్ కార్పొరేటర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ ధంసలాపురం కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులంతా సమన్వయంతో పని చేసి కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు జగన్, నాయకులు మందడపు బ్రహ్మారెడ్డి, మందడపు మనోహర్, చావా నారాయణరావు, పోట్ల వీరేందర్, కొప్పెర ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజూ ఒకటే..



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గానికి మూడవ రోజు శనివారం ఒక నామినేషన్ దాఖలైంది. స్వతంత్ర అభ్యర్థిగా షేక్ బాజీబాబా నామినేషన్ దాఖలు చేశారు. ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన షేక్ బాజీ బాబా స్వతంత్ర అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అదేవిధంగా ఆధార్ పార్టీ తరుపున కుక్కల నాగయ్య రెండవ సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

# దివ్యాంగులకు కృత్రిమ పాదాలు పంపిణీ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ పాదాలు పంపిణీ చేశారు. శనివారం గట్టయ్య సెంటర్‌లో గల రోటరీ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో 25 మంది దివ్యాంగులకు జైపూర్ పరిజ్ఞానంతో తయారు చేసిన కృత్రిమ పాదాలను ఉచితంగా పంపిణీ చేశారు. అమెరికాలోని దేశరాజు రవి, శైలజ లు ఖమ్మంజిల్లా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం చేశారు. ఇందుకు సహకరించిన దొడ్డపనేని హరినాథ్‌ను వారు అభినందించారు. అమెరికాలో స్థిరపడిన మాతృదేశాన్ని మరిచిపోకుండా సహాయం చేస్తున్న వారిని వక్తలు కొనియాడారు. పంపిణీ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కె. వెంకటరెడ్డి, డిఎన్ఎఫ్ ఛైర్మన్ బోనాల రామకృష్ణ, ప్రతినిధి బైయ్యన బాబురావు, రోటరీ ట్రస్టు కార్యదర్శి దోడ్డపనేని సాంబశివరావు, కో ఆర్డినేటర్ పసుమర్తి రంగారావు, కార్యదర్శి పి. ముత్తయ్య, ఐ. రామకృష్ణ, బి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ మధిర :** ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మధిర టౌన్ ఎస్సై సంధ్య హెచ్చరించారు. శనివారం తనిఖీల్లో భాగంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మధిరలోని వైరా ఏటి నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలని, నిబంధనల విరుద్ధంగా వ్యవహరిస్తే ఎతంటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం ఆమె వెంట ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## చెరువును ఆక్రమిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన బత్తిని యాలాద్రి గ్రామంలోని సర్వేనెంబర్ 170లోని గంగిరెడ్డి కుంట పూర్తిగా ఆక్రమణకు గురయ్యిందని, తక్షణమే సర్వే చేపించి హద్దులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌కు శనివారం ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా ప్రయివేట్ గ్రానైట్ వ్యక్తులు ఒండ్రు కుంట అంచున పోయడం వల్ల చెరువులో వున్న నీరు ఆ ఒండ్రుతో కలిసి కలుషితం అవ్వుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశాడు. 9ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు కింద ఆయకట్టు ఉన్నందున్న రైతులు వ్యవసాయం చేసుకుంటున్నట్లు విజ్ఞప్తి చేశాడు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి తక్షణమే చెరువును కాపాడాలని కోరాడు.

## ఉపాధ్యాయురాలికి పదవీవిరమణ వీడ్కోలు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లగూడెంపంచాయతీలోని ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన సెకండరీగ్రేడ్ తెలుగు,ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలి పదవీ విరమణ విడ్కోలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను అక్కడికి ముఖ్య అతిధులుగా హాజరైన పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ శ్యాంసన్, హెచ్‌ఎం ఎం ప్రసాద్‌రావు, టిఎస్‌యూటిఎఫ్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి మహేష్, గ్రామస్థులు సత్తి యాకయ్య, సత్తి నాగరాజు, ధనియాకులు రామయ్య, మేకపోతుల వీరయ్య, మాలాది మల్లయ్య, అంగడాల ఎల్లయ్య, సిర్ర శ్రీను, పేరం సంపత్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలకు హెల్త్ క్యాంపు




**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలోని సీతానగరం, తూటికుంట్ల, పెద్దబీరవల్లి, రాయన్నపేట గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలకు వడదెబ్బ లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఓఆర్‌ఓస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సీతానగరం గ్రామంలో శానిటేషన్ కార్యక్రమాన్ని ఎంపిడిఓ ఎల్.రాజు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, సిహెచ్‌ఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ దానయ్య, రాజ్యలక్ష్మి , స్వర్ణమార్త, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## బంధం విజయ అకాల మృతికి నివాళి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు సతీమణి బంధం విజయ అకాల మృతి పట్ల బిఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు. శనివారం ఆమె భౌతికాయాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపురం విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/ చింతకాని :** మండల పరిధిలోని బస్వాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఐదుగురు విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారు. విద్యార్థులు బొడ్డు తులసి, ఆవుల సమీక్షిత, రసపుత్ర రిషి, షేక్.హుస్సేన్‌పాషా, అరవపల్లి ప్రణీత్‌సాయిలను సిపిఐ నాయకులు రాసాల మోహన్‌రావు, మార్గం శ్రీను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు సీట్లు సాధించడంలో కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని గ్రామస్థులు అభినందించారు.

## ప్రతిభ చాటిన సిరిపురం విద్యార్థులు



**ప్రజాపక్షం/ మధిర :** గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలో మధిర మండలం సిరిపురం ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ చాటి సీట్లు సాధించారు. పాఠశాలకు చెందిన 8మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఎనిమిది విద్యార్థులు వివిధ గురుకులాల్లో సీట్లు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. గురుకుల పరీక్షకు ప్రతి సంవత్సరం ప్రత్యేక శిక్షణిస్తూ ఎక్కువమంది విద్యార్థులను గురుకుల పాఠశాలకు ఎంపికయ్యే విధంగా కృషి చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులను ఎంఇఓ వై.ప్రభాకర్ అభినందించారు.

## రవికుమార్‌ను పరామర్శించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కాంగ్రెస్ యువజన నాయకులు నల్లమోతు రవికుమార్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. శనివారం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవికుమార్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, చావా నారాయణరావు, పుచ్చకాయల వీరభద్రం, పోట్ల వీరేందర్, అబ్దుల్ రషీద్, కమటం రామకృష్ణ, గజ్జల వెంకన్న, బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**వివాహ శుభకార్యాల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల...**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో పలు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. శనివారం మోతీనగర్, మమత రోడ్డు, ఖానాపురం ప్రాంతాల్లో జరిగిన వివాహ మహోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, చావా నారాయణరావు, పోట్ల వీరేందర్, తల్లాడ రమేష్, కల్వకుంట్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రజలను మోసం చేసిన మోడీని ఓడించండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**

**ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్:** దేశ ప్రజలను మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోడీని ఓడించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన వేంసూరు లోని పునుగుపాటి చెరువు వద్ద జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను శనివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ సందర్శించి, కూలీలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ కార్మికుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులు, కూలీలు, కార్మికులు, మహిళల హక్కులు కాలరాస్తున్న మోడీ రాజ్యాంగం ప్రజాస్వామ్యం లౌకికవాద రక్షణకు మోడీని గద్దె దించాలనీ ఆయన పిలుపునిచ్చారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక విధానాలు, రైతు వ్యతిరేక మహిళా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో నరేంద్ర మోడీని ఓడించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు వేల లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం రైతుల పట్ల వ్యవసాయ కూలీల పట్ల, ఉపాధి కూలీల పట్ల కార్మికుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ ఉపాధి కూలీలకు పొట్ట గొట్టేందుకు ప్రయత్నం చేస్తుందని దండు ఆదినారాయణ విమర్శించారు. రైతుల కోసం తెచ్చిన నల్ల చట్టాలు రద్దు కోసం రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేసి 700 మంది అమరులయ్యారని, అదే విధంగా 44 కార్మిక చట్టాలు నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలురాస్తుందని దేశ



వ్యాప్తంగా 25 కోట్ల మంది ఉపాధి కూలీలు పనిచేస్తుండగా వారికి కనీస కూలి పడాలంటే మూడు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్లో నిధులు ఇవ్వవలసి ఉండగా కేవలం 60 వేల కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఉపాధి హామీ పథకాన్ని తీసేసేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. దేశంలో బిజెపిని, బిజెపికి సపోర్ట్ చేస్తున్న మతతత్వ శక్తులను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య సత్తుపల్లి డివిజన్ నాయకులు సిపిఐ కార్యదర్శి ఎస్కె లాల్ మహమ్మద్, ఎస్.కె రంజాన్ బి, యువజన సమైక్య ఏఐవైఎఫ్ నాయకులు ఎస్కె హమీద్, తిన్న పోయిన రామారావు, పుల్లారావు, రాధ, ఆదెమ్మ, గురు ప్రసాద్, వెంకటేశ్వరరావు, ప్రసాద్, సత్యనారాయణ, సత్యవాణి, రఫీ, ధావన్, తేజ, రఫీ, లాల్ బి, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, రాంప్రసాద్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, కృష్ణ, మహేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

### జూనియర్ న్యాయవాదులు
## అనునిత్యం అధ్యయనం చేయాలి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నూతనంగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన జూనియర్ న్యాయవాదులు అను నిత్యం కేసుల తీర్పులను అధ్యయనం చేయాలని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జ్ అరుణ పిలుపునిచ్చారు. సత్తుపల్లి కేంద్రంలోని కళాభారత్ భవనంలో ఐఏఎల్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఇమావలి అధ్యక్షతన జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్ ) జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ కు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌరవప్రదమైన వృత్తి నీ ఎంచుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడటానికి న్యాయవాద వృత్తి ఎంతో తోడ్పడుతుందన్నారు . తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యులు దుస్సా జనార్ధన్ మాట్లాడుతూ నూతనంగా వచ్చిన చట్టాలను అధ్యయనం చేయాల్సిన అవసరం జూనియర్ న్యాయవాదుల మీద ఉందన్నారు. వాస్తవానికి 152 సంవత్సరాల క్రితం రాసిన ఐపీసీని మార్చటంలో తప్పేమీ లేదని కానీ అందులో బిజెపి తన విధానాన్ని ప్రవేశపెట్టడమే ఇబ్బందికరమైన అంశమన్నారు. నూతన చట్టాల గురించి ఉపన్యాసించిన ఖమ్మం జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ మామిడి హనుమంతరావు మాట్లాడుతూ ఐపీసీలో బ్రిటిష్ కాలం నాటి 22 సెక్షన్లను తొలగించారన్నారు. సిఆర్పిసి లో 17 సెక్షన్లను తొలగించడంతో పాటు ఆరు సెక్షనలను కలిపారని ఆయన వివరించారు. నూతనంగా ప్రవేశపెట్టిన న్యాయ సంహిత చట్టాలలో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ గురించి ప్రముఖంగా ప్రస్తావించారని ఆయన తెలియజేశారు. అప్పటి చట్టాలు రాసినప్పుడు డిజిటల్ రంగంలో అంత అభివృద్ధి జరిగలేదని, ఇప్పుడు జరిగిన డిజిటల్ రంగా అభివృద్ధినీ తోడ్పాటు చేసుకొని ఈ చట్టాల్లో పొందుపరిచింది అన్నారు. వాస్తవానికి సత్వరం న్యాయ పేరుతో ఈ చట్టాలు తెచ్చినప్పటికీ ప్రస్తుతానికి ఉన్న కోర్టుల సంఖ్య జడ్జిలు ఇతర యంత్రాంగం లేని సమస్యతో మళ్లీ కథ మొదటికే వస్తుందన్నారు.




ముఖ్యంగా 124 ఎ ను పొందుపరిచి బిజెపి తన మార్కును చూపించుకుందన్నారు. రాజా ద్రోహం పేరు తొలగించి దేశద్రోహంగా మార్చిందన్నారు. ఈ సెక్షన్ ప్రకారం దేశ సార్వభౌమా అధికారానికి, సమగ్రతకు నష్టం వాటిలితే ఎవరి మీద నైనా దేశద్రోహం కేసు పెట్టి అరెస్టు చేయొచ్చు అన్నారు. ఒకసారి దేశద్రోహం కేసు నమోదైతే దానికి శిక్ష మరణ దండ నేనని ఆయన తెలిపారు. వరంగల్ ఆదర్శ లా కళాశాల అధ్యాపకులు పి తేజ రెడ్డి కుటుంబ చట్టాల గురించి ఉపన్యసించారు. మన పురాణాల నుంచి కుటుంబ చట్టాలు ఏర్పడ్డాయి అన్నారు. ఏ మతానికి ఆ మతం చట్టాల రూపంలో తమ యొక్క పురాణాలను, సంస్కృతి సాంప్రదాయాలను ఫ్యామిలీ లా లో ప్రవేశపెట్టిందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఖమ్మం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఉపాధ్యక్షులు కే ఉమామహేశ్వరరావు, టి అరుణ, కోశాధికారిశరత్ బాబు, సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడమ్స్, సీనియర్ న్యాయవాదులు ఎస్ లక్ష్మణరావు, కే వెంకటేశ్వరరావు, ఎం అజయ్ కుమార్, సిహెచ్ కృష్ణ ప్రసాద్, ఎస్ కే బుజ్జి సాహెబ్, కే విజయ్ కుమార్ , సిహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# క్లాసిక్‌గా శరీరాకృతి..!

**-కరోనా నేర్పిన పాఠాలతో రోగనిరోధక శక్తిపై దృష్టి**
**-నిత్యకసరత్తులో లభిస్తున్న సంపూర్ణ ఆరోగ్యం**
**-శరీర సౌష్టవానికి జిమ్‌వైపు పరుగులు పెడుతున్న యువత,పెద్దలు**
**-వేకువజామునే పలకరిస్తున్న పలు రకాల వ్యాయమ పరికరాలు**





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ (బైపాస్‌రోడ్):** ప్రస్తుత యాంత్రిక జీవితంలో బిజీ..బిజీగా ఉరుకులు పరుగులతో ప్రతి ఒక్కరూ గడిపేస్తున్నారు. ఈ నేపథ్యంలో తినేతిండి విషయంలో ఫాస్ట్‌ఫుడ్,బేకరీఫుడ్‌కు అలవాటు పడటంతో స్థూలకాయ సమస్యలు పెరిగిపోతున్నాయి. శరీరం అలసిపోకుండా ఉండడంతో బిపి, షుగర్ ఇతర వ్యాధులు దరి చేరుతున్నాయి. కానీ కరోనా మహమ్మారి ఆరోగ్యం పట్ల కొత్త పాటాలను నేర్పించింది. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు పోషకాహారంతో పాటు శారీరక శ్రమ తప్పనిసరి అని తేల్చేసింది. దీంతో జిమ్ముల వైపు పరిగెడుతున్న యువతీ, యువకులు, పెద్దలకు ఖమ్మం నగరంలోని ఇల్లందురోడ్డు (సర్దార్‌పటేల్ స్టేడియం ఎదుట)లో గల క్లాసిక్ జిమ్ వాటన్నింటినీ సమపాలుగా అందిస్తూ ఆకట్టుకుంటుంది. వేకువజామునే పలు రకాల పరికరాలతో వర్కవుట్లకు ఉపక్రమించేలా ఉత్సాహాన్ని కలిగిస్తుంది. చెమట పట్టి శరీరం అలసిపోకుండా ఏసీలతో చల్లని వాతావరణాన్ని కల్పిచడంతో పాటు సెక్యూరిటిగా బయోట్రిక్ సౌకర్యం,జుంబా డ్యాన్స్ చేపిస్తూ ఆసక్తిని కల్పిస్తున్నారు. ప్రధానంగా జిమ్ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ ట్రైనింగ్‌తో పాటు ఆహార నియమాలు(డైట్)పాటించేలా చొరవ తీసుకుంటున్నారు.

**క్లాసిక్ జిమ్ ప్రత్యేకతలు...**

వెయిట్‌లాస్, ఫ్యాట్‌లాస్, వెయిట్‌గేన్, వెయిట్ ట్రైనింగ్, ఫిట్‌నెస్‌అండ్‌కార్డియో, ఇంక్రిజ్‌దఇమ్యునిటీపవర్, పర్సనల్ ట్రైనింగ్, బెస్ట్ ఫిజిక్, పవర్‌లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్, మెడిటేషన్, యోగా, హోమ్ ట్రైనింగ్, అలాగే జుంబా డ్యాన్స్ శనివారం,ఆదివారం చేపిస్తుంటారు. ఇది కార్డియో,ఫిట్‌నెస్ మూవ్‌ల కదలికను ప్రేరిపితం చేస్తుంది. ఇది ఒక ఉల్లాసకరమైన, ఉత్సహంను అందించే చక్కని నృత్యం. జిమ్‌లో ప్రత్యేకంగా ముగ్గురు ట్రైనర్లు ఉన్నారు. వారిలో ఇద్దరు స్పెషల్ ట్రైనింగ్ ఇస్తుండగా.. మరో ట్రైనర్ జిమ్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి వర్కవుట్లు ఎలా చేయాలో ట్రైనింగ్ ఇస్తుంటారు. ఇక్కడ కార్డియో,వర్కవుట్లకు కలిపి రెండు విభాగాలను చేశారు. ఒక దగ్గర కార్డియో మరో దగ్గర వర్కవుట్ల చేసుకునేలా సౌకర్యం కల్పించారు. అదేవిధంగా ప్రత్యేక వ్యాయమ పరికరాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

**పాశ్చాత్య దేశాల్లో విద్యార్థిదశ నుండే అవగాహన...**

భారతదేశంలో పోల్చుకుంటే పాశ్యాత్య దేశాలు(ఇతర కంట్రీస్)లోనే వ్యాయంమంపై అక్కడి ప్రజలకు ఎక్కువ అవాగాహన ఉంటుంది. ఎందుకంటే అక్కడి ప్రభుత్వాలు విద్యార్థి దశ నుంచే పిల్లలకు వ్యాయమంపై దృష్టి కేంద్రికరించాల్సిందిగా భోదిస్తుంటారు. ఈ నేపథ్యంలో వారికి చిన్న నాటి నుంచే అది ఒక అలవాటుగా మారడంతో ఆరోగ్యం పట్ల శ్రద్ధ, మంచి శరీరాకృతిని కలిగిఉంటారు. ఈ విధానం ఇక్కడ లేకపోవడంతో చాల వరకు ప్రజలు స్థూలకాయం, బిపి, షుగర్, వంటి తదితర రోగాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం ఒకో రాష్ట్రంలో ఒకో విధంగా మెడికల్ అలవెన్స్ సౌకర్యాలను కల్పిస్తున్నాయి. దీంతో మరల ప్రజలపైన భారం పడుతుంది. వీటికి చెక్ పెట్టి ప్రభుత్వం వ్యాయమంపై విద్యార్థి దశ నుంచే అవాగాహణ కల్పించడం ద్వారా సత్ఫలితాలను ఇవ్వనున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

**60కేజీల బరువు తగ్గాను :**
**శ్రీనివాస్, సాయిగణేష్ నగర్ (ఖమ్మంరూరల్ మండలం)**



నేను 156 కేజీల బరువు ఉండేవాడిని.ఇక్కడి జిమ్‌కు సంవత్సరంనర నుంచి వస్తున్నాను. నిర్వాహకురాలు నాగేంద్ర మేడం సలహాలు,సూచనలతో 60 కేజీల బరువు తగ్గాను. ప్రతిరోజు జిమ్‌కు క్రమం తప్పకుండా వెళ్లడం డైట్‌ప్లాన్, యోగా, వాకింగ్ చేయడం ద్వారా మంచి ఫలితాన్ని ఇస్తుంది. నేను ఇప్పుడు ఎంతో ఉత్సంహం, ఆరోగ్యం, సంతోషంగా ఉన్నాను. నా వరకు క్లాసిక్ జిమ్ ది బెస్ట్.

**క్రమపద్ధతిలో వ్యాయామం చేయాలి :**
**మనోజ్‌కుమార్, నిర్వాహకుడు, ట్రైనర్**



శరీరానికి కావాల్సిన ఆకృతిలో మలుచుకోవాలంటే క్రమ పద్ధతిలో వ్యాయామం చేయాల్సి ఉంటుంది. ఇప్పటి యువత సిక్స్ ప్యాక్ కావాలని కోరుకుంటుంది. ఇందుకు తగ్గట్టుగా వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఫిట్‌నెస్ ట్రైనర్ పర్యవేక్షనలో ప్రతిరోజూ డైట్ మెయింటెన్ చేస్తూ వ్యాయమం చేస్తే సరిపోతుంది. ఇక యువతులు, మహిళలు నాజుకుగా రూపొందడానికి కొత్త టెక్నిక్‌లు అనేకం అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ట్రైనర్ చెప్పిన విధంగా వర్కవుట్లు చేస్తే బరువు తగ్గడం, బాడీని పెంపొందించుకోవడం పెద్ద కష్టమేమి కాదు.

## ఎండలు మండుతున్నాయి.. పని వేళలు మార్చండి



**ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఎస్‌ఓ టు జిఎంకి వినతి**

**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రతి సంవత్సరం మే లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయితే ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలోనే ఎండలు దంచి కొడుతున్నాయని దయచేసి యాజమాన్యం స్పందించి పని వేళలు మార్చాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు శనివారం సాయంత్రం ఏరియా ఎస్ ఓ టు జిఎం బి శ్యాంసుందర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో పారిశుధ్యం, రోడ్లు క్లీనింగ్, ఉద్యానవనాల కాంటాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలని యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని కోరారు. అదేవిధంగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో నిర్వాశితులకు మరియు ఉపాధి కోల్పోయిన వార్డు బాయ్ లకు న్యాయం చేయాలి కాంట్రాక్టర్ల అవినీతిపై విచారణ జరిపించి నిర్వాసితులకు పరుగు పందెంలో అర్హత సాధించిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు అందరికీ ఖాకీ యూనిఫామ్ ఇవ్వాలని, విధి నిర్వహణలో చనిపోయిన ఇల్లందు ప్రైవేట్ కన్వీనెన్స్ వెహికల్ డ్రైవర్ కంపా ప్రసాద్ కుటుంబానికి భీమా మరియు ఎక్స్ గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. కాంటాక్ట్ కార్మికులందరికీ వాహన డ్రైవర్లకు పర్మినెంట్ కార్మికులకు ఇచ్చినట్లుగా ఓఆర్‌ఎస్ మరియు మజ్జిగ ప్యాకెట్లు అందజేయాలన్నారు. 2024 మార్చి 31 వరకు అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికుల సి ఎం పి ఎఫ్ జమ వివరాలతో కూడిన పాస్ బుక్ లు ఇవ్వాలని, ఏదైనా అత్యవసర పనులపై విధులకు హాజరు కాలేని కాంటాక్ట్ కార్మికులకు విధిస్తున్న అమానవీయ పెనాల్టీ రద్దు చేయాలని, కరోనాతో చనిపోయిన కొండాపురం సి.ఎస్.పి కాంట్రాక్ట్ కార్మికుడు పంగా మధుసూదన్ కుటుంబానికి 15 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపునకు చేపట్టిన చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. పై సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కే గురుమూర్తి, కే నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వర్లు, యు. శివరామకృష్ణ, జె సత్యవతి, కే రమణ, సిహెచ్ నాగమణి, కే రమాదేవి, వి. అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి ఫ్రిడ్జ్‌కు పెరిగిన గిరాకీ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పేదోడి ఫ్రిడ్జ్ కు గిరాకీ పెరిగింది. వేసవికాలం కారణంగా మండే ఎండలకు చల్లని నీటిని త్రాగాలని ప్రతి ఒక్కరిలోఉండటంతో ఫ్రిజ్‌లు కొనలేని వారు మట్టి కుండ లపై దృష్టి మళ్లించారు. చూడడానికి మట్టికుండలే అయినా ఫ్రిడ్జ్ కంటే చల్లదనంగా ఆరోగ్యకరంగా ఉంటుంది. వేసవికాలం కారణంగా దాహాన్ని తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ చల్లని నీటి కోసం ఫ్రిడ్జ్‌లు లేదా మట్టి కుండలు వాడుతుంటారు. పేదవాడు నుంచి ఉన్నత సంపన్న వర్గాల వరకు ఎక్కువగా మట్టితో తయారుచేసిన కుండలను వాడుతుంటారు. ఫ్రిజ్లో పెట్టిన మంచినీరు త్రాగడం వలన అనారోగ్యాలు ఎక్కువగా వస్తాయని వైద్యులు సూచిస్తుండడంతో మట్టికుండలలో నీరు తాగితే ఆరోగ్యంగా ఉంటారని ప్రత్యేక వైద్య నిపుణులు ప్రజలకు తెలియపరచడంతో మండలంలో పేదోడి ఫ్రిడ్జ్ కు గిరాకీ పెరిగింది. మండల పరిధిలోని పలు గ్రామాల వారు కల్లూరు మండల కేంద్రానికి వచ్చి కొనుగోలు చేసుకుని పోతున్నారు. దీంతో ఇదే అదునుగా వారు ధరలు పెంచేశారు. దీనివలన ఏ గ్రామంలో చూసిన ప్రతి గృహంలో మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి.

# వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

## పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ విపి గౌతమ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శనివారం నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వడదెబ్బ నుండి రక్షణ సూచనలపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ విపి గౌతమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఎండలో తిరగవద్దని అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశా, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీలలో ఓఆర్‌ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పిహెచ్‌సిలలో ఓఆర్‌ఎస్ ద్రావణం, ఐవి ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతి రోజు సరిపడ తాగు నీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్లేటప్పుడు గొడుగు, టోపిని, సన్నని లేత రంగు కాటన్ వస్త్రాలు ధరించాలని, ద్విచక్ర వాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఎండలో పని చేసే కార్మికులు తరచుగా నీటితో పాటు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడుకోవచ్చునన్నారు. వేడి ఎక్కువగా ఉండే సమయంలో వంట చేయడం మానుకోవాలని, వంట ప్రదేశాన్ని తగినంతగా గాలి, వెలుతురు ఆడడానికి తలుపులు, కిటికీలను తెరవాలని, ఆల్కహాల్, టీ, కాఫీ , కార్బోనేటెడ్ శీతల పానీయాలు, పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను నివారించాలని ఇవి వాస్తవానికి ఎక్కువ శరీర




ద్రవాన్ని కోల్పోవడానికి లేదా కడుపు నొప్పికి దారితీయవచ్చునన్నారు. అధిక మాంసకృత్తులు కలిగిన ఆహారాన్ని, నిల్వ ఆహారాన్ని తినవద్దని, నిలిపి ఉంచిన వాహనంలో పిల్లలను లేదా పెంపుడు జంతువులను వదిలివేయవద్దని, వాహనం లోపల ఉష్ణోగ్రత పెరిగి ప్రమాదకరంగా మారవచ్చునన్నారు. ఆర్టీసి బస్సుల్లో వడదెబ్బ నుండి రక్షణ సూచనలతో ఉన్న ఇట్టి పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. బస్సు డ్రైవర్లకు, కండక్టర్లకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. అధిక చమట, దాహం, బలహీనత, తలతిప్పడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు ఉన్నచో వడదెబ్బగా భావించి సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లడం లేదా 108కు ఫోన్ చేయాలని కోరారు. అదేవిధంగా వీరికి సహాయం అందువరకు చల్లని ప్రదేశానికి తరలించాలన్నారు. చల్లని నీటితో శరీరాన్ని తుడవాలని, వీలైనంత గాలి తగిలేవిధంగా జాగ్రత్త వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ బి. మాలతి, టిఎస్ ఆర్టీసి డిప్యూటీ ఆర్‌ఎం పవిత్ర, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సైదులు, ఎస్డిపివో నీలోహన, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలపై దాడికి కుట్ర పన్నడం హేయమైన చర్య

## కుట్రపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాడికి కుట్ర పన్నడం హేయమైన చర్య అని దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రఘునాథపాలెం మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చైతన్యవంతమైన ఖమ్మంజిల్లాలో 40 ఏళ్ల పాటు మచ్చలేని నాయకునిగా, ఆదర్శవంతమైన రాజకీయ నాయకునిగా అభివృద్ధి ప్రధాతగా ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై ఎన్నికల సమయంలో దాడికి కుట్ర చేయడం హేయమైన చర్య అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లు, భూ కబ్జాలు , అక్రమ కేసులు పెట్టించారని వాటి నుంచి విముక్తి కోసం ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని వారు తెలిపారు. మంత్రి తుమ్మలపై దాడికి, హత్యాయత్నానికి కుట్ర పన్నడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రశాంత వాతావరణమే లక్ష్యంగా ఖమ్మంలో అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పై దాడికి కుట్ర పన్నిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు



డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా బాలాజీ నాయక్, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు, మాజీ సర్పంచులు తమ్మిని నాగేశ్వరరావు, బండి వెంకన్న, మారం కరుణాకర్‌రెడ్డి, కోటేరు నర్సిరెడ్డి, గుడిపూడి రామారావు, బాతుల సుధాకర్, లాల్ సింగ్, బోయన వెంకటనర్సయ్య, తారాదేవి, ఎస్‌కె సిద్ధిఖ్, తక్కెళ్లపాటి భద్రయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై దాడికి కుట్ర పన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

# సండ్ర వాహనాన్ని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద శనివారం సాయంత్రం ఫ్లయింగ్ స్కాడ్ అధికారులు ప్రభాకర్ రావు తదితర అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు కోడ్ సందర్భంగా ఎలాంటి వారి వాహనాన్ని అయినా తనిఖీలు చేయాల్సిందేనని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం



**ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్ః** త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం చూపించిన పార్లమెంట్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి ఖమ్మం జిల్లా నుండి ముఖ్యంగా సత్తుపల్లి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరుపున మనందరం కలిసి కట్టుగా కృషిచేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ గ్రామ నాయకులు, కార్యకర్తలు కోరారు. సత్తుపల్లి మండలం పాకలగూడెం గ్రామంలో ఆయన శనివారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గెలిచిన 3 నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం అన్ని పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేరుస్తుందన్నారు. గ్రామాల్లో అన్ని సమస్యలు పూర్తి స్థాయిలో జిల్లా మంత్రివర్యులు సహకారం తో పూర్తి చేసి అభివృద్ధి చేసి చూపిస్తాం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో, తరువాత జరగనున్న సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయ భేరి మోగించాలి అని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టండి

**ప్రజాపక్షం/మణుగూరుః** రైతు సమస్యలపై గ్రామ గ్రామాన పోస్ట్ కార్డులు ఉద్యమం చేపట్టాలని పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు శనివారం ఫేస్‌బుక్ ద్వారా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ లీగల్ సెల్ కి 10 లక్షల చెక్ పార్టీ ఇచ్చిందన్నారు. బిఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ పెట్టే అక్రమ కేసులకు భయపడకండి అని తెలిపారు. పార్టీయే కోర్టు ఖర్చులు భరిస్తుందన్నారు. బలవంతంగా పెట్టే కేసులు పెడితే బిఆర్‌ఎస్ భయపడదన్నారు. కాంగ్రెస్ పార్టీ కి వంతపడే అధికారులను వదిలిపెట్టమని పేర్కొన్నారు. అక్రమ కేసులు పెడితే వడ్డీతో సహా తీర్చుకుంటామని రేగా అన్నారు. అక్రమంగా కాంగ్రెస్ పార్టీకి దోచిపెడితే చూస్తూ ఊరుకోమని, అక్రమాల అడ్డాలో వందలాది మంది కార్యకర్తలతో కాపలా కాస్తామని తెలిపారు. ఘర్షణలు తలెత్తితే పోలీసులదే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బిఆర్‌ఎస్ కార్యకర్తలు జోలికొస్తే ప్రతిఘటన తప్పదన్నారు. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తే ప్రభుత్వందే బాధ్యతన్నారు.

# ఉదయంపూటే పనికి రావాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల , చిన్నగోపతిలో జరుగుచున్న మినీ ట్యాంక్ పనులను శనివారం డిఆర్‌డిఓ సన్యాసయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఉపాధిహామి పనికి ఉదయం 6 గంటలకే పనికి రావాలని 11 గంటలవరకు కొలతల ప్రకారం రూ 300 వచ్చేలా పనిచేయాలని తెలిపారు. పని ప్రదేశంలో మాస్టర్ రోల్ కాల్ , ఫస్ట్ ఎయిడ్ కిట్ , పని ప్రదేశములో సౌకర్యాలు వాటిని పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల ఎంపిడీఓ రోజారాణి , ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తా

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు పల్లపోతుల వాసు స్పష్టం చేశారు. శనివారం స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మండల ఆర్య



వైశ్య సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని, ఈనెల 28న జరిగే జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈసమావేశంలో ఎంపిపి జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శీమకుర్తి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు జల్లిపల్లి గుప్తా, కొనిజర్ల ఉమామేశ్వరరావు, జల్లిపల్లి దేవరాజు, కంచర్ల రామారావు, ముత్తా సుమాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీటు సాధించిన వారు... ఆరో తేదీ లోగా జాయిన్ కావాలి

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందిన వారు మే నెల ఆరో తేదీ కల్లా సంబంధిత అర్హత ధ్రువీకరణ పత్రాలతో జాయిన్ కావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. పాఠశాలలో ప్రవేశ అర్హత పరీక్ష ద్వారా 80 మంది కి సీటును పొందారని వారందరికీ సిబ్బంది ద్వారా ఫోన్ తో సమాచారాన్ని అందించామని సమయానుకూలంగా ఆరో తేదీ లోపల అన్ని అర్హత పత్రాలను తీసుకొని పాఠశాలలో అందించాలని శ్రీలత పేర్కొన్నారు. లేనిచో సీటును కోల్పోతారని వారు పేర్కొన్నారు. అదే విధంగా 21వ తేదీ ఆదివారం ఉదయం పదకొండు గంటల నుంచి ఒంటిగంట వరకు ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులలో మిగిలిన సీట్లకు భర్తీ చేసేందుకు పరీక్షలు జరుగుతాయని ఈ పరీక్షలకు 481 మంది హాజరవుతారని వారు వివరించారు.

# ప్రమాదకరంగా గుంత

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు లింగాల మధ్య ఉన్న రహదారిలో పెద్ద గుంత ఏర్పడటంతో రాకపోకల కొనసాగిస్తున్న ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. గత నెల రోజులుగా గుంట క్రమేపి పెద్దదవుతూ వాహనదారులు కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ప్రతి రోజు 15 గ్రామాల వారితో పాటు ఆంధ్రా, తెలంగాణ ప్రజలు ఈ రహదారిపై ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. అకస్మాత్తుగా దగ్గరకు రాగానే గుంట కనపడటంతో ప్రమాదానికి గురవుతున్నారు. పలు గాయాల పాలవుతున్నారు. రోడ్లు, భవనాలు శాఖ అధికారులకు తెలియపరిచిన పట్టించుకోవట్లేదని ప్రయాణికులు వాపోతున్నారు. త్వరితగతిన గుంటను కూర్చి వేసి ప్రమాదాల నుంచి రక్షించాలని ప్రయాణికులు వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.



# ఏఐటియుసి బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య**



**ప్రజాపక్షం/మణుగూరుః** కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగుతూ ఏఐటీయూసీ బలోపేతానికి కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ కార్యాలయంలో ఆదెర్ల సురేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మండలంలో అనేకమంది చదువుకున్నటువంటి నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు లేక చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఓబి కంపెనీలలో కార్మికులకు ఉపాధి అవకాశాలు ఇవ్వడంలో విఫలమవుతున్నారని వారు ఆరోపించారు. సింగరేణిలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మీనారాయణ, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గల సుధాకర్, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, (జి .వి) కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు రాము, అవినాష్, బోసెట్టి సంపత్, ప్రసాద్, అన్వర్, సంతోష్ పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాలో
# నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు..

**జడ్పీ సీఈవో వినోద్**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జిల్లా పరిషత్ సీఈవో ఎస్.వినోద్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....జిల్లాలో ప్రజలు తాగునీటి కి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయా గ్రామాలలో నీటి వనరులు, వాటి లభ్యత ను బట్టి అద్దె కు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు రావద్దని అన్నారు. అధికారులు అప్రమతంగా ఉండాలని అన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీటి సరఫరా విషయంలో అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదని అన్నారు. కూలీలు ఎండదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా కూలీల సంఖ్య ను మరింత పెంచేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, ఈజీఎస్ ఏపీవో సునీత,ఈసీ శేషగిరిరావు పాల్గొన్నారు.



## వలస ఆదివాసీలకు
# సోలార్ ద్వారా తాగునీరు అందించిన ఎంపీఓ



**ప్రజాపక్షం/పినపాకః** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పినపాక మండలంలో తాగు నీటికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం పినపాక మండలం అమరారం గ్రామపంచాయతీ పిట్టతోగు గ్రామంలో సోలార్ ప్లేట్ల ని ఏర్పాటు చేసి తాగునీటిని కల్పించారు. పిట్టతోగు గ్రామానికి కనీసం విద్యుత్ సౌకర్యం లేక పక్కనే ఉన్న చెలిమ ద్వారా బురద నీరు తాగుతున్నారని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మడివి రమేష్ ద్వారా తెలుసుకొని ఆ ప్రాంతాన్ని సందర్శించిన విషయం తెలిసిందే. శనివారం ఆ గ్రామంలో స్థానిక సెక్రటరీ తో కలిసి బోర్ క్లీన్ చేయించి మోటర్ ద్వారా సోలార్ ప్లేట్ల సహాయంతో నీటిని అందించారు. ఈ సందర్భంగా ఎంపివోకు ఆదివాసి వలస గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నో సంవత్సరాలుగా తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డామని, కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేక అనారోగ్యం వస్తే మంచానికి కట్టుకొని తీసుకుపోయిన రోజులు ఉన్నాయని ఆయన ముందు తమ ఆవేదన తెలిపారు. తన పరిధిలో సాధ్యమయ్యే సమస్యలను పరిష్కరిస్తారని ఎంపీఓ వారికి తెలిపారు. గ్రామంలో గల సమస్యలను ఐటిడిఏ పిఓ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సెక్రటరీ వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.3.34 కోట్ల విలువైన బంగారం పట్టివేత

**ఆధారాలు చూపడంతో పంపించిన అధికారులు**

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** పార్లమెంట్ ఎన్నికల నేపధ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అధికారులు భారీ ఎత్తున బంగారం ను పట్టుకున్నారు. వాటికి సంబంధించిన పత్రాలు చూపటంతో పంపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని జిల్లా సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలలో భాగంగా శనివారం భారీ ఎత్తున బంగారం ను పట్టుకున్నారు. రూ.3.34 కోట్ల విలువైన బంగారం ను గుర్తించారు. మొత్తం 12 రకాలు బంగారం ఉండగా, సూర్యాపేట జిల్లా లోని మిర్యాలగూడెం లో 1రకం బంగారం ను అందించారు. మిగిలిన 11 రకాల బంగారం ను ఖమ్మం లోని పలు దుకాణాలకు తీసుకోస్తున్నారు. పైనంపల్లి వద్ద వాహానాలు తనిఖీలు చేస్తుండుగా...బంగారం ను గుర్తించారు. వెంటనే జిల్లా నోడల్ అధికారి కి విషయం ను తెలియజేశారు. కాగా కూసుమంచి సీఐ జనార్ధన్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వేణుమనోహార్ ను ఘటనా స్థలం కు చేరుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఇరువురు అధికారులు దాదాపు రెండు గంటల పాటు బంగారం కు సంబంధించిన వివరాల పై ఆరా తీశారు. అందుకు సంబంధించిన షోరూమ్ లో డెలివరీ ఎంత, దుకాణాలు వారు ఇచ్చిన ఆర్డర్ ఎంత అనే వివరాలు మ్యాచ్ అయ్యాయా లేదా అని వివరాలు సేకరించారు. పక్కా ఆధారాలు, రశీదు లు ఉండటంతో జిల్లా అధికారులు ఆదేశాలు మేరకు బంగారం ను పంపించారు. ఈ కార్యక్రమంలో పైనంపల్లి చెక్‌పోస్టు అధికారులు నరేష్, ప్రసాద్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



# కార్మికులకు గ్లౌజులు, షూస్ పంపిణీ

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, బూట్లు ఎక్కడ అనే కథనం ప్రచురించడం జరిగింది. దానికి సంబంధించిన మున్సిపాలిటీ కమీషనర్ వేణు శనివారం మున్సిపాల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ వేణు మాట్లాడుతూ ప్రతిఒక్క పారిశుద్ధ్య కార్మికుడు గ్లౌజులు, షూస్ ధరించి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు సైదులు, పలువురు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.




## గురుకులంలో
# సీటు సాధించిన విద్యార్థినికి అభినందనలు

**ప్రజాపక్షం/కారేపల్లిః** ఐదో తరగతి ప్రవేశానికై జరిగిన గురుకుల సెట్‌లో ప్రాథమిక పాఠశాల పోలంపల్లి విద్యార్థిని పర్షిక రోహిణి వైరా గర్ల్స్ గురుకులంలో సీటు సాధించిన విద్యార్థినికి ప్రధానోపాధ్యాయులు అజ్మీర వీరు నాయక్, సహ ఉపాధ్యాయులు కమల్ల సుదర్, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, పాఠశాల విద్యార్థులు అభినందనలు తెలిపారు. గత ఐదు సంవత్సరాల నుండి వివిధ ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటుతున్న ఆధునిక పాఠశాల పోలంపల్లి విద్యార్థులు 2019–20లో వాగబోయిన భావన మోడల్ స్కూల్ కారేపల్లిలో సీటు సాధించిన విద్యార్థిని, 2021–22లో ముగ్గురు విద్యార్థులు మేఘన, మంజీరా, ప్రణయ గురుకులంలో సీటు, 2022–23లో వాగబోయిన వైష్ణవికి ఏకలవ్య సెంట్రల్ స్కూల్‌లో సీటు సాధించింది. మరో విద్యార్థిని, మూతి కీర్తికి మోడ్ స్కూల్ కారేపల్లిలో సీటు, 2023–24లో పర్షిక అక్షయ అనే విద్యార్థినికి బెస్ట్ అవైలబుల్(ఖమ్మం బేబిమూన్)లో సీటు సాధించడం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులను అభినందించడం జరిగింది.



# దమ్మపేట మండలంలో మెచ్చా పర్యటన

**ప్రజాపక్షం/దమ్మపేటః** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం మండలంలో పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నాచారం గ్రామంలో గూడపాటి వారి వివాహ వేడుకలో, చీపు వారి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చీకటి పుల్లయ్యని పరామర్శించారు. చలమప్పగూడెం గ్రామంలో గుండె వారి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మండల పరిధిలోని దురదపాడు గ్రామంలో అంకమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మెచ్చాని ఆలయ కమిటి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/వైరాః** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు వేడుకలు వైరాలో తెలుగుదేశం పార్టీ ఆఫీస్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ ఇంచార్జి చెరుకూరి చలపతిరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పుట్టినరోజు ఎన్నో జరుపుకోవాలని ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలి. తెలుగుదేశం పార్టీకి ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించడం ముఖ్యమంత్రిగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల అధ్యక్షులు కిలారు సురేందర్, కార్యదర్శి రచ్చబండ కృష్ణయ్య, మన్నెంపల్లి ప్రదీప్, పరస రామకృష్ణ, వేణుగోపాలరావు, హరి రమేష్, కూరపాటి రమేష్, అప్పారావు, కట్టా నర్సింహారావు, బొడంపూడి మురళి, రాయల నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు జీరో అకౌంట్‌లు

**ప్రజాపక్షం/కరకగూడెంః** బట్టుపల్లి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు మోహన్ రావు ఆధ్వర్యంలో ఎస్బిఐ జీరో అకౌంట్ లో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మోహన్ రావు మాట్లాడుతూ పిల్లలకు జీరో అకౌంట్ లో ఎంతగానో ఉపయోగ పడతాయని అందుకనే ప్రతి ఒక్క పిల్లవాడికి స్కూలుకు పిలిపించి జీరో అకౌంట్ ఇప్పించడం జరుగుతుందని వారికి స్కాలర్షిప్ అందడానికి జీరో ఎకౌంటు ఉపయోగపడుతుందని, ఆయన తెలిపారు. విద్యార్థులకు ఎకౌంట్లో తీయాలంటే తల్లిదండ్రులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వారికి ఇబ్బంది కలగకుండా ఎకౌంట్లో ఇప్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అశోక్, ఎస్బిఐ పాయింట్ అధికారి సాంబశివరావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గురుకుల పరీక్షా ఫలితాల్లో ఉషోదయ ప్రభంజనం

## ఒకే పాఠశాల నుండి 83 మంది విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/ఏన్కూరుః** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఏన్కూరులోని శ్రావణి కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉషోదయ పాఠశాలలో 91మందికి గాను 83 మంది విద్యార్థులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ పాఠశాల అర్హత సాధించి ప్రభంజనం సృష్టించారు. ముఖ్యంగా ఏన్కూరులోని బాలుర గురుకుల పాఠశాలలో 16మంది వైరాలోని బాలికల పాఠశాలలో 27మంది అర్హత పొందారు. మిగిలిన 40మంది విద్యార్థిని, విద్యార్థులతా వివిధ పాఠశాలల్లో సీట్లు సాధించడం విశేషం. గత 20 సంవత్సరాలుగా వీరి ఆధ్వర్యంలో నడుస్తున్న నవోదయ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎంతోమంది విద్యార్థులు సీట్లు సాధించడం అందరికి తెలిసినవ ఇషయమే. ప్రతి సంవత్సరం ఎంతోమంది పేద విద్యార్థులను గురుకుల ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించే విధంగా శిక్షణ ఇస్తూ కృషి చేస్తున్నటువంటి పాఠశాల యాజమాన్యానికి తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. దీంతో పాటు ఈ పాఠశాలలో చదివి గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను మండల ప్రజలు అభినందించారు.

# బంధం శ్రీనివాసరావును పరామర్శించిన ఎమ్మెల్సీ మధు

**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని ముష్టికుంట గ్రామానికి చెందిన మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బోనకల్ మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు సతీమణి బంధం విజయ(55) అకాల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు, జెడ్పిచైర్మన్‌లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ఆమె భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావులు ఆమె భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బాణోతు కొండ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, కార్యదర్శి నాగేశ్వరరావు, ఎస్‌కె.హుస్సేన్, వేమప్రసాద్, పారా ప్రసాద్, గద్దల వెంకటేశ్వర్లు, మొండితోక జయాకర్, రంగిశెట్టి



కోటేశ్వరరావు, మధిరమండల పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, బోళ్ళ ప్రసాదరావు తదితరులు నివాళులర్పించారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సిఐ ఇంద్ర సేనారెడ్డి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** రాబోవు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పోలింగ్ కేంద్రాలను జూలూరుపాడు సిఐ ఇంద్రసేనా రెడ్డి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్ఐ మాచినేని రవి , సిబ్బంది ఉన్నారు.

## గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలి

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బెండాలపాడు గ్రామంలో తేజావత్ లక్ష్మణ్ ఇంటి ముందు రాత్రి బానోత్ మంగమ్మ ఆమె కూతురు పడుకున్నారు. అర్ధరాత్రి ఎవరో గుర్తు



తెలియని దొంగ వచ్చి ఆమె మెడలో ఉన్నటువంటి బంగారు చైన్‌ను తెంపుని పోయాడు. ఈవిషయంపై చంద్రుగొండ ఎస్ఐకు బాధితురాలు ఫిర్యాదు చేయగా శనివారం సంఘటన స్థలానికి జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ మాచినేని రవిలు క్లూస్ టీం, జాగిలాలతో పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు, ఆయా ప్రాంతాలను పరిశీలించి సాక్ష్యాలను సేకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎండాకాలం సమయంలో గ్రామాలలో చాలా మంది ఆరుబయట నిద్రిస్తుండడ జరుగుతుందని, కాబట్టి వారి యొక్క విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచుకొని, తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు.

## బిఆర్ఎస్‌కి మండల అధ్యక్షుడు రాజీనామా



**ప్రజాపక్షం/ ఏన్కూరుః** టిఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజీనామా చేసినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో గత ఐదు సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీకి మండల అధ్యక్షుడిగా ఉన్న బానోతు సురేష్‌నాయక్ అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు తాతా మధుకి రాజీనామా లేబర్ అందజేసినట్టు తెలిపారు. తన వ్యక్తిగత కారణాల దృష్ట్యా రాజీనామా చేయడం జరిగిందని, త్వరలో ఏ పార్టీలో చేరుతాననేది ప్రకటిస్తానని అన్నారు.

## ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించండి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించాలని గత కొద్ది రోజులుగా దుర్వాసనతో కూడిన రంగు నీళ్ల సరఫరా అవుతున్నాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. నీటి ఎద్దడితో ప్రజ



లు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ కలుషిత నీరు సరఫరా అయితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన తెలిపారు. స్థానిక నర్సింహా స్వామి టెంపుల్ ఏరియాలో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం యానాలి సాంబశివారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సలాం మాట్లాడుతూ గతంలో రోజు 40 నిమిషాల పాటు మంచినీరు సరఫరా అయ్యేదని ఇప్పుడు రోజు నీళ్లు రాకపోగా నాలుగు రోజులకొకసారి నీటి సరఫరా జరుగుతుందన్నారు. నీటికి ఇబ్బంది లేదన్న అధికారుల మాటల్లో నిజం లేదని ఆయన ఆరోపించారు. విలీన గ్రామాల్లోను నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని దీనిని అదునుగా భావించి మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు ఇష్టానుసారంగా నీటి వ్యాపారం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఖమ్మం నగరానికి సరఫరా అవుతున్న నీటికి సంబంధించి అధికారులు పరిశీలన చేయాలని కలుషిత నీరు సరఫరా కాకుండా స్వచ్ఛమైన నీరు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు నూనె శశిధర్, ఎండి రెహ్మాన్, రమణ, ఉపేంద్రమ్మ, దుర్గానాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/దమ్ముపేటః** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అత్యవసర కౌన్సిల్ సమావేశం పార్టీ సీనియర్ నాయకులు కూకలకుంట సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ యార్లగడ్డ భాస్కర్ రావు హాజరై దమ్ముపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా సుంకుపాక ధర్మ, సహాయ కార్యదర్శిగా బత్తుల సాయి, సహాయ కార్యదర్శిగా యార్లగడ్డ మణికంఠలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

**ప్రజాపక్షం/కామేపల్లి:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని విజయం ఖాయం అయిందని ప్రముఖ అడ్వకేట్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడేపూడి విఠల్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ



అభ్యర్థి పోరిక బలరాం నాయక్ శుక్రవారం మహబూబాబాద్‌లో నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఆ నామినేషన్ ఫీజును బోడేపూడి విఠల్‌రావు శుక్రవారం బలరాం నాయక్ దంపతులకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపి అభ్యర్థిగా బలరాం నాయక్ పార్లమెంట్‌లో అఖండ విజయం సాధించాలని కోరుతూ ఆయన నామినేషన్ ఫీజు రూ 12,500 అందజేశారు. ఈసందర్భంగా విఠల్‌రావు మాదట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానున్నదని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సహకరించాలని ఆశీర్వించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట నేతలు కృష్ణారెడ్డి, హనుమంతరావు, రామచందర్, బత్తుల వీరబాబు తదితరులు ఉన్నారు.

# కొత్త వ్యక్తులు వస్తే సమాచారం అందించండి

**ప్రజాపక్షం/కరకగూడెంః** కొత్త వ్యక్తులు వస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ అన్నారు. కరకగూడెం మండల పరిధిలోని ఆదివాసి గ్రామాలను శనివారం ఎస్ఐ రాజేందర్ తమ సిబ్బందితో పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,



తెలంగాణ పోలీసులు, ఆదివాసి గూడాలలో అన్ని వసతులు కల్పిస్తున్నారని ఆయన అన్నారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరు వచ్చిన తమకు తెలియజేయాలని గ్రామ పెద్దలను ఆయన కోరారు. గ్రామాలలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఆదివాసి గ్రామాలలో వేసవికాలంలో నీటి కొరత లేకుండా అన్న చర్యలు చేపడతామని అని అన్నారు. ఆదివాసి యువకులు అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని యువకులు విద్య ఆటల వైపు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆదివాసి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో పనులలో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు వేగం పెంచాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య ఆదేశించారు. మండలం లోని కట్టుకాసారాం,కొంగర, చెరువుమాధారం, రాజారాంపేట, ఆజయ్‌తండా గ్రామాలలో పాఠశాల పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... పనుల విషయంలో నిర్లక్ష్య ం చేయకుండా శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యం ను నెరవేర్చేందుకు సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. పనులు యుద్ధ ప్రాతిపధికన పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఉపాధ్యాయులు, ఆదర్శ కమిటి సభ్యులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.